క్లుప్తంగా

ఎంఈఓ-1గా చంద్రశేఖర్


బల్లా చంద్రశేఖర్

గుమ్మలక్ష్మీపురం: మండల విద్యాశాఖ అధికారి-1గా బల్లా చంద్రశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి జిల్లా దేవరపల్లి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న ఆయన ఆదివారం జరిగిన కౌన్సెలింగ్‌లో గుమ్మలక్ష్మీపురం ఎంఈఓ-1గా నియామితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యాభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని చెప్పారు.

కోటిపాం గ్రామస్తుల ఔదార్యం


మృతుడు తల్లికి ఆర్థిక సాయం చేస్తున్న కోటిపాం గ్రామస్తులు

కొమరాడ: పార్వతీపురం మండలం నర్సిపురం వద్ద గత నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కోటిపాం గ్రామానికి చెందిన ధర్మారావు మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుని కుటుంబానికి కోటిపాం గ్రామస్తులంతా కలిసి సర్పంచ్ సుంకరి సుగుణ ఆధ్వర్యంలో రూ.25 వేలు ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. నిరుపేదలు, వృద్ధులైన మృతుని తల్లిదండ్రులకు తమ వంతు సాయం చేశామని, దాతలు ముందుకొచ్చి వారిని ఆదుకోవాలని కోరారు.

7న ఏకలవ్య పాఠశాలల్లో మిగులు సీట్లకు కౌన్సెలింగ్

సీతంపేట: ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి వరకు మిగులు సీట్ల భర్తీకి ఈనెల 7న కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భామిని పాఠశాలలో 6వ తరగతిలో 25 (13 బాలురు, 12 బాలికలు) సీట్లు, 7వ తరగతిలో 3 (బాలురు), 9వ తరగతిలో 2 (బాలురు) ఖాళీలు ఉన్నట్లు వెల్లడించారు. మెళియాపుట్టి పాఠశాలలో ఆరో తరగతిలో బాలురు 9, బాలికలు 8, ఏడో తరగతిలో బాలురు 1, 8వ తరగతిలో బాలురు 1, 9వ తరగతిలో బాలురు 2, బాలికలు 2 సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. గతంలో ప్రవేశ పరీక్షకు హాజరైన వారు మాత్రమే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు.

ఎంఈఓలకు అభినందన


ఎంఈఓలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వీరఘట్టం: మండల విద్యాశాఖ అధికారి-1గా ధనుకొండ గౌరినాయుడు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనతో పాటు ఎంఈఓ-2గా విధులు నిర్వహిస్తున్న ఆర్.ఆనందరావును ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఎమ్మార్సీ సిబ్బంది అభినందించారు. మండలంలో విద్యాభివృద్ధికి, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. అనంతరం ఎంఈఓలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులంతా కృషి చేయాలని సూచించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


సీతంపేట రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

పాలకొండ రూరల్: వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై బి.శివప్రసాద్ హెచ్చరించారు. పాలకొండ-విశాఖ, శ్రీకాకుళం, సీతంపేట రహదారుల్లో సోమవారం ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. సరైన వాహన ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు లేనివారిపై అపరాధ రుసుం విధించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదుచేశారు.

కొండాపురంలో 'ఫ్యామిలీ డాక్టర్'


వైద్య పరీక్షలు చేస్తున్న కమలనాథ్

పాలకొండ: మండలంలోని కొండాపురం గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కమలనాథ్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది రోగులకు వైద్య సేవలందించారు. దీర్ఘకాలిక రోగులకు అవసరమైన మందులతో పాటు ఆరోగ్య సలహాలు అందించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ దేవి, ఏఎన్ఎం కుమారి, ఆర్.శ్రీనివాసరావు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే పేదలకు న్యాయం


రేగులపాడులో మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి

• ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

వీరఘట్టం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని, అన్ని వర్గాలకు న్యాయం జరుగుతోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. రేగులపాడు గ్రామంలో సోమవారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతీ గడపకు వెళ్లి నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నవరత్న పథకాలతో కోట్లాది మంది నిరుపేద కుటుంబాలు లబ్ధిపొందాయని, వారి జీవన పరిస్థితులు మెరుగుపడ్డాయని అన్నారు. ఆర్‌బీకేలు, గ్రామ సచివాలయాలు, వెల్‌నెస్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చి గడపగడపకూ సంక్షేమ పాలన అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వం అబద్ధపు హామీలతో మహిళలు, రైతులతో పాటు అన్ని వర్గాలను మోసం చేసిందని విమర్శించారు. ఎన్నికల హామీలను 98 శాతానికి పైగా అమలు చేసి దేశంలోనే నంబర్ వన్ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి గుర్తింపు పొందారన్నారు. రాష్ట్రంలో సుస్థిర పాలన కొనసాగించాల్సిన అవసరం ఉందని, అది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా.. పేదలకు న్యాయం జరగాలన్నా మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని, అందుకు ప్రజల ఆశీస్సులు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, సర్పంచ్ మెరుగుల భవానీ, చంద్రమౌళీశ్వరరావు, వైస్ ఎంపీపీ పత్రి విజయకుమారి, పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి గోవిందరావు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి గ్రామసభలు దోహదం


సమావేశంలో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ గోపాలరావు

గరుగుబిల్లి: గ్రామాభివృద్ధికి గ్రామసభలు ఎంతో దోహదం చేస్తాయని ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు అన్నారు. మండలంలోని ఉల్లిభద్ర, కొంకడివరం గ్రామాల్లో సోమవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ముందస్తుగా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. దీనివల్ల ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టేందుకు వీలుంటుందన్నారు. పంచాయతీలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఎస్.దివ్యలక్ష్మి, ఎ.అప్పలనాయుడు, కార్యదర్శులు కోటేశ్వరరావు, కూర్మినాయుడు తదితరులున్నారు.

ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి


రక్త పరీక్షల గది వద్ద క్యూకట్టిన రోగులు

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రికి సోమవారం రోగుల తాకిడి పెరిగింది. ఆర్థో, గైనిక్, కంటి వ్యాధులు, జ్వరాలతో బాధపడుతున్న రోగులు అధిక సంఖ్యలో ఉన్నారు. మలేరియా, టైఫాయిడ్, ఇతర వ్యాధులతో వచ్చిన వారు సుమారు 200ల పైనే ఉన్నారు. వీరందరికీ వైద్యసేవలతో పాటు మందులు అందించామని సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు.

మహాప్రస్థాన రథం వితరణ


మహాప్రస్థాన రథాన్ని మందిరం నిర్వాహకులకు అందిస్తున్న కొండలరావు, తదితరులు

పాలకొండ రూరల్: నగరపంచాయతీ పరిధి సెగిడి వీధిలో గల శ్రీసత్యసాయి శివం మందిరానికి మహాప్రస్థాన రథాన్ని మాజీ కౌన్సిలర్ పల్లా కొండలరావు సోమవారం అందజేశారు. రూ.10 లక్షల విలువ చేసే ఈ వాహనాన్ని తమ తల్లిదండ్రులు బాజ్జీరావు, సూరమ్మ జ్ఞాపకార్థం వితరణ చేసినట్లు చెప్పారు. మందిరం ద్వారా మహాప్రస్థాన రథం సేవలు అవసరమైనవారికి అందించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎండీఎం ఆపరేటర్లు

గరుగుబిల్లి: నిత్యావసర సరుకులు సరఫరా చేసే ఎండీఎం ఆపరేటర్ల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతూ మండలంలోని ఎండీఎం ఆపరేటర్లు తహసీల్దార్ జీవీ జనార్దన్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో సరుకులకు సంబంధించి ఒకే దఫా వేలిముద్రలు ఉండేవని, ప్రస్తుతం రాగులు, బియ్యానికి ఒకసారి, కందిపప్పు, చక్కెర, గోధుమ పిండి సరఫరాకు సంబంధించి రెండోసారి వేలిముద్రలు వేయాల్సి వస్తోందన్నారు. దీనివల్ల ఎంతో వ్యయప్రయాసలకు లోనుకావడంతో పాటు సర్వర్ సమస్య కూడా తలెత్తుతోందన్నారు. అధికారులు దృష్టిసారించి ఒకే దఫా బయోమెట్రిక్‌తో సరుకులు సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మోదీ మౌనం వీడాలి


కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

వీరఘట్టం: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులపై ప్రధాని నరేంద్ర మోదీ మౌనం వీడాలని వీరఘట్టం తెలుగు బాప్టిస్ట్ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. దాడులను ఖండిస్తూ సోమవారం రాత్రి వీరఘట్టం ప్రధాన రహదారిలో ప్లకార్డులు, కొవ్వొత్తులు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి కొనసాగిస్తే దేశవ్యాప్తంగా నిరసనలు ఉద్ధృతం చేస్తామని పేర్కొన్నారు.

నేటి కార్యక్రమాలు

ఉపాధిహామీ ప్రజావేదిక

పాలకొండ రూరల్: మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం ఉదయం 10 గంటలకు ఉపాధిహామీ సామాజిక తనిఖీలపై ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏపీఓ ఈశ్వరమ్మ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మండల పరిధిలో ఏప్రిల్ 2022 నుంచి 2023 మార్చి 31 మధ్య కాలంలో చేపట్టిన పనులకు సంబంధించి ఆడిట్ సిబ్బంది క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీలు నిర్వహించారని, అందులో గుర్తించిన అంశాలను ప్రజావేదికలో బహిర్గతం చేయడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాల్గొనే ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.


అల్లూరి విగ్రహావిష్కరణ

సీతంపేట: స్థానిక బస్టాండ్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఆయన 126వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఆవిష్కరించనున్నట్లు ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

వెలగవాడలో జగనన్న సురక్ష

పాలకొండ: మండలంలోని వెలగవాడ గ్రామంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పి.సోమేశ్వరరావు తెలిపారు. ఇప్పటికే గ్రామంలో సర్వే చేసి గ్రామస్తులకు అవసరమైన సేవలను గుర్తించామని, అందుకు సంబంధించిన ప్రక్రియను పూర్తిచేశామన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆకట్టుకున్న నఖచిత్రం



గరుగుబిల్లి మండలం నాగూరుకు చెందిన నఖచిత్రకారుడు పల్ల పరిశినాయుడు వేసిన నఖచిత్రం ఆకట్టుకుంది. గురుపౌర్ణమి సందర్భంగా వ్యాస మహర్షి చిత్రాన్ని చేతి గోళ్లతో అద్భుతంగా వేసి పలువురి ప్రశంసలు అందుకుంటున్నాడు.

– గరుగుబిల్లి

సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంతోషం


బాలేసులో మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

• ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలు అభ్యున్నతి సాధించాయని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని బాలేసు గ్రామ సచివాలయం పరిధిలోని బాలేసు, బాలేసుగూడ, రేగిడి, కర్లగూడ, గాంద్ర గ్రామాల్లో సోమవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రతీ గడపకూ వెళ్లి నాలుగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. వారి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ వారి ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు చేరవేస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని అన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రజలంతా మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ మండంగి రాధిక, వైస్ ఎంపీపీ నిమ్మక లక్ష్మణరావు, బాలేసు సర్పంచ్ కె.కళావతి, ఎంపీటీసీ సభ్యురాలు ఉషారాణి, ఎస్సీ,ఎస్టీ సెల్ మండల కన్వీనర్లు సామల మాధవరావు, తోయక గోపాల్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన


పంచాయతీ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

వీరఘట్టం: గత నాలుగు నెలలుగా వీధికుళాయిల నుంచి తాగునీరు సక్రమంగా రాకపోవడంతో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సీబీఎం కాలనీ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఖాళీ బిందెలతో పంచాయతీ కార్యాలయానికి చేరుకుని నిరసన తెలియజేశారు. నాలుగు నెలలుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నా.. పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. అధికారులు తమ పనితీరుతో ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువస్తున్నారని మండిపడ్డారు. దీనిపై ఈఓ రామచంద్రరావు స్పందిస్తూ..కుళాయి పాయింట్లకు ట్యాంపులు వేయించి తాగునీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

గిరిజన స్పందనకు 97 వినతులు


వినతులు స్వీకరిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: స్థానిక ఐటీడీఏలో ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన గిరిజన స్పందనకు 97 వినతులు వచ్చాయి. సన్యాసిపేట గ్రామంలో తాగునీటి ట్యాంక్ ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన బి.కృష్ణ అధికారులను కోరారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు, వైర్లు మార్చాలని కారిగూడకు చెందిన మోహనరావు, ఎగువ డొంబంగివలస గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. పవర్ వీడర్ మంజూరు చేయాలని తుంబలిగూడకు చెందిన సుందరరావు, హిరమండలం రిజర్వాయర్‌లో చేపలు పట్టుకునేందుకు అనుమతి ఇవ్వాలని పూతికవలసకు చెందిన కామేశ్వరరావు కోరారు. వినతులను పరిశీలించి పరిష్కరిస్తామని పీఓ తెలిపారు. స్పందనలో ఏపీఓ రోసిరెడ్డి, ఇంజినీరింగ్ ఈఈ సింహాచలం, గిరిజన సంక్షేమశాఖ డీడీ శ్రీనివాసరావు, డిప్యూటీ ఈఓ లిల్లీరాణి, ఏఎంఓ కోటిబాబు, పీఏఓ హరికృష్ణ, డీఎల్‌డీఓ గోపాలకృష్ణ, జీసీసీ డీఎం సంధ్యారాణి, సీడీపీఓలు రంగలక్ష్మి, విమలారాణి పాల్గొన్నారు.

రోవర్ సాయంతో భూముల సర్వే


పట్టణ శివారులోని తోటల్లో సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది

పాలకొండ రూరల్: పట్టణంలోని వీరఘట్టం రహదారిలో సర్వే నంబర్ 155 నుంచి 355 మధ్య ఉన్న భూముల్లో సోమవారం సమగ్ర భూ సర్వే చేపట్టారు. రోవర్ పరికరాలతో భూముల సరిహద్దులు గుర్తించారు. ఈ కార్యక్రమాన్ని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ బి.బుచ్చయ్య పరిశీలించారు. సక్రమంగా సర్వే చేపట్టాలని, తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్దిష్ట సమయానికి సర్వే పూర్తిచేయాలని సిబ్బందికి సూచించారు. అలాగే సర్వే సిబ్బందికి భూ యజమానులు, రైతులు సహకరించాలని కోరారు. సర్వేలో ఏమైనా లోటుపాట్లు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో వీఆర్వోలు బి.సాయిశ్రీనివాస్, రామారావు, సర్వేయర్లు గణేష్‌కుమార్, మణికుమార్ తదితరులున్నారు.

గడువులోగా పనులు పూర్తిచేయాలి


సమావేశంలో పాల్గొన్న పీఆర్ డీఈ వెంకటరావు

గరుగుబిల్లి: నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తిచేయాలని పీఆర్ డీఈ వెంకటరావు సిబ్బందిని ఆదేశించారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బందితో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాధాన్యత ప్రకారం సచివాలయ భవన నిర్మాణాలను, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలన్నారు. అలాగే గడపగడపకు కార్యక్రమంలో గుర్తించిన, నాడు-నేడు పనులపై ప్రత్యేక దృష్టి సారించి పనులు పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ జి.పైడితల్లి, జేఈ ఫరూర్, ఎంఈఓ ఎస్.నాగభూషణరావు పాల్గొన్నారు.

6న రెండో విడత కౌన్సెలింగ్

సీతంపేట: స్థానిక గిరిజన గురుకుల బాలురు, బాలికల కళాశాలల్లో ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు ఈ నెల 6న రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి మెరిట్ ఆధారంగా సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. రెండు కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో పది చొప్పున సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. బాలికల కళాశాలలో వొకేషనల్ ఏఅండ్‌టీ గ్రూపులో 10 సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. స్థానిక బాలుర కళాశాలలో కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

గురుపౌర్ణమిని పురస్కరించుకుని సాయిబాబా ఆలయాల్లో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. బాబాకు హారతి, పల్లకి సేవలతో పాటు హోమాలు, అభిషేకాలు చేశారు. పలుచోట్ల ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధనలు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్


పాలకొండ: షిర్డీసాయి మందిరంలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు


కురుపాం: కురుపాం సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


వీరఘట్టం: తెలగవీధిలో సాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు


పాలకొండ రూరల్: భాసూరు అన్నసమారాధన


గరుగుబిల్లి: ఉద్దవోలులో గురుపౌర్ణమి పూజల్లో పాల్గొన్న భక్తులు